సబితా ఇంద్రారెడ్డికి శుభాకాంక్షలు



మంత్రిని కలిసిన జాలిగం చిత్తారి తదితరులు

అత్తాపూర్: మహేశ్వరం నియోజకవర్గం నుంచి సబితా ఇంద్రారెడ్డి మరోసారి విజయం సాధించారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ చెందిన జాలిగం చిత్తారి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆమె నివాసంలో కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాతీర్పును స్వాగతిస్తున్నా

పటాన్‌చెరు టౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో పటాన్‌చెరు ప్రజల తీర్పును స్వాగతిస్తున్నానని ఎస్ఎంఆర్ యువసేన అధ్యక్షుడు, బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసిన నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆయా పార్టీలు టికెట్ కేటాయిస్తామని చెప్పి కాలయాపన చేశాయని, తక్కువ సమయంలోనే ప్రచారం చేసిన తనకు 46,059 ఓట్లు వచ్చాయన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు అధికారంలోనే ఉండాల్సిన అవసరం లేదని, తనను నమ్మి ఓటు వేసిన ప్రతిఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మీ బిడ్డగా.. మున్ముందు కూడా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు, కార్యకర్తలు అధైర్యపడొద్దన్నారు.

వెచ్చని నేస్తాలు !

ఆకట్టుకున్న రంగు రంగుల దుప్పట్లు • వివిధ రకాల వెచ్చని దుస్తులు



రంగు రంగుల దుప్పట్లు, చిన్నారుల మంకీ క్యాప్స్



హఫీజ్‌పేట్ డివిజన్ జాతీయ రహదారి పక్కన వెలసిన దుకాణాలు

హఫీజ్‌పేట్: శీతాకాలం వచ్చిందంటే ప్రతి ఒక్కరికి గుర్తుకొచ్చేది వెచ్చని దుప్పటి. నగరంలో రోజురోజుకు పెరుగుతున్న చలి తీవ్రతకు ప్రజలు గజ గజ వణుకుతున్నారు. వేసవి కాలంలో ఎండలు, వర్షాకాలంలో తీవ్రమైన వర్షాలు కురిసాయి. శీతాకాలంలో చలి కూడా అంతే తీవ్రంగా ఉంది. ప్రజలు చలి నుంచి కాపాడుకోవడానికి వెచ్చని దుప్పట్లు, ఉన్ని దుస్తులు ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. గత నెల నుంచి చలి తీవ్రత పెరుగుతూ వస్తోంది.

- హఫీజ్‌పేట్ పాత ముంబాయి రోడ్లు, ఆల్విన్ కాలనీ బస్టాప్ వద్ద చలికి వెచ్చని దుస్తుల దుకాణాలు ఏర్పాటు చేశారు.
- మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన చిరు వాప్యారులు ఏళ్ల తరబడి ఇక్కడే నివాసం ఉంటూ శీతాకాలం దుప్పట్లు, స్వెటర్లు, మంకీ క్యాపులు, మాస్కులు, హ్యాండ్ గ్లౌజులు ప్రజలకు అందుబాటులో ఉంచారు.
- హిమాచల్‌ప్రదేశ్, లుథియానా, హరియాణా తదితర ప్రాంతాల నుంచి ఉన్ని దుస్తులు, దుప్పట్లు తీసుకొచ్చి అమ్ముతున్నారు.
- చిన్నారులు, వృద్ధులు, మహిళలకు రంగు రంగుల మంకీ క్యాపులు, స్వెటర్లు, మాస్కులు అందుబాటులో ఉంచారు.
- చిన్నారులకు సంబంధించిన మంకీ క్యాపులు అందరిని ఆకట్టుకుంటున్నాయి.
- మూడు నుంచి ఆరు నెలల వరకు దుప్పట్ల వ్యాపారం కొనసాగుతూ ఉంటుంది.
- రూ.150 నుంచి వేయి వరకు వివిధ రకాల స్వెటర్లు, దుప్పట్లు సరసమైన ధరలకు విక్రయిస్తున్నారు.
- నెలల తరబడి లక్షల రూపాయలు వెచ్చించిన ధరలు పలుకడం లేదని వ్యాపారస్తులు వాపోతున్నారు.
- ఉన్ని దుస్తులు, స్వెటర్లు, మంకీ క్యాపులు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి.

తక్కువ ధరలు పలుకుతున్నాయి..



నేను 11 ఏళ్ల నుంచి దుప్పట్ల వ్యాపారం చేస్తున్నాను. రోజు రోజుకు ధరలు తగ్గిపోతున్నాయి. దుప్పట్ల వాడకం కూడా తగ్గింది. కూలీల జీతాలు కూడా ఇవ్వలేదని పరిస్థితి ఏర్పడింది. వివిధ రాష్ట్రాల నుంచి ట్రాన్స్‌పోర్టుల ద్వారా దుప్పట్లు లారీలలో వస్తున్నాయి. రానున్న రోజుల్లో దుప్పట్ల విక్రయం పెరుగుతుంది.

– అంతర్, దుప్పట్ల దుకాణదారుడు

శీతాకాలం రాగానే నగరానికి వచ్చేస్తాం..



శీతాకాలం వచ్చిందంటే హైదరాబాద్ నగరానికి దుప్పట్ల వ్యాపారానికి వచ్చేస్తాం. ప్రతి ఏటా నవంబర్ నుంచి జనవరిలో వచ్చే సంక్రాంతి పండుగ వరకు వ్యాపారం చేస్తాం. చిన్నారులు, వృద్ధులు, మహిళలకు కావాల్సిన స్వెటర్లు, మంకీ క్యాపులు, చెవులకు సంబంధించిన క్యాపులు అందుబాటులో ఉంచాం. వేసవి కాలంలో తమ ఊరికి వెళ్లిపోతాం. నగరంతో మాకు దశాబ్దకాలం నుంచి దుప్పట్ల వ్యాపారం చేస్తున్నాం. ఇప్పుడు వ్యాపారం కొద్దిగా తగ్గింది.

– పింటు, దుప్పట్ల వ్యాపారి

పార్టీల వారీగా అభ్యర్థుల ఓట్ల శాతం

- బీఆర్ఎస్‌కు 43.9 శాతం
- కాంగ్రెస్‌కు 30.9 శాతం
- బీజేపీకి 22.37 శాతం

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజవర్గం అసెంబ్లీ పోలింగ్‌లో బీఆర్ఎస్ పార్టీకి 43.93 శాతం ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి 30.93 శాతం, బీజేపీకి 22.37 శాతం ఓట్లు వచ్చాయి. బీజేపీ భారీగా ఓట్లు చీల్చడంతో కాంగ్రెస్ రెండో స్థానానికి పరిమితమైంది. నవంబర్ 30న జరిగిన పోలింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కలుపుకొని 3,58,139 ఓట్లు పోలయ్యాయి. నోటాకు 3145 ఓట్లు రాగా.. చెల్లని ఓట్లు 309 ఉన్నాయి. వ్యాలిడ్ ఓట్లు 3,54,685 ఉన్నాయి. బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీకి 1,57,332 ఓట్లు వచ్చాయి. సమీప కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్‌కు 1,10,780 ఓట్లు, బీజేపీ అభ్యర్థి ఎం.రవికుమార్‌యాదవ్‌కు 80,148 ఓట్లు వచ్చాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆరెకపూడి గాంధీ 51.22 శాతంతో 1,43,307 ఓట్లు సాధించారు. ఈసారి ఆయనకు 7.29 శాతం ఓట్లు తగ్గాయి. టీడీపీ, కాంగ్రెస్ పార్టీల ఉమ్మడి అభ్యర్థి భవ్య ఆనంద్ ప్రసాద్ 33.39 శాతంతో 99,012 ఓట్లు సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్‌కు గతంతో పోల్చిలే 2.46 శాతం ఓట్లు తగ్గాయి. బీజేపీ అభ్యర్థి గజ్జెల యోగానంద్ 7.9 శాతంతో 22,106 ఓట్లు సాధించారు. గతంతో పోల్చితే బీజేపీ అభ్యర్థి రవికుమార్‌యాదవ్ 80,148 ఓట్లతో అదనంగా 14.47 శాతం ఓట్లు ఎక్కువగా సాధించారు. బీజేపీ ఓటు బ్యాంకు గణనీయంగా పెరిగింది.

ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీకి సన్మానం



గజమాలతో సత్కరిస్తున్న డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆరికెపూడి గాంధీ అఖండ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా సోమవారం చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డిలు గజమాలతో సత్కరించి, మిఠాయిలు తినిపించారు. బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ఉద్యమకారులు, కార్యకర్తలు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి ప్రచారంలో వెనకబడ్డాం



ముఖ్యనేతల సమావేశంలో రవికుమార్‌యాదవ్

బీజేపీ అభ్యర్థి రవికుమార్‌యాదవ్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

గచ్చిబౌలి: బూత్ స్థాయి ప్రచారంలో వెనకబడటంతో అనుకున్న స్థాయిలో ఓట్లు రాలేదని శేరిలింగంపల్లి బీజేపీ అభ్యర్థి ఎం.రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మసీద్‌బండలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్‌స్థాయిలో కొందరు నాయకులు అనుకున్న స్థాయిలో పనిచేయకపోవడంతో నష్టం వాటిల్లిందన్నారు. బూత్ స్థాయి ప్రచారంతో పాటు పోల్ మేనేజ్‌మెంట్‌లో మిగతా పార్టీలతో పోలిస్తే వెనకబడినట్లు ఆయన తెలిపారు. అధిష్టానం టికెట్ కెటాయింపులో చివరిరోజు వరకు కాలయాపన చేయడం మైనస్‌గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలు, వివిధ మోర్చా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. వచ్చే ఎంపీ ఎన్నికలలో బీజేపీ విజయం సాధించే దిశగా పని చేయాలని నాయకులను ఆయన కోరారు. మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి శ్రీరాములుయాదవ్, నియోజకవర్గం కన్వీనర్ రాఘవేంద్ర రావు, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాచమళ్ల నాగేశ్వర్‌గౌడ్, బొబ్బా నవతారెడ్డి తదితరులున్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట రూ.30, పచ్చిమిర్చి 45 , బెండకాయ రూ. 40, కాకరకాయ 30, దొండకాయ 35, దోసకాయ 30, ఆలుగడ్డ 25, చామ 50, కీర 25, బీరకాయ 40, వంకాయ 30, గోకర 50, బీన్స్ 50, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 50, చిక్కుడు 50, ఉల్లిగడ్డ రూ. 50 (1 కేజీ), ములక్కాయలు (1) రూ.10 , క్యాలీఫ్లవర్ (1) రూ.30, సొరకాయ (కేజీ) రూ.20, అల్లం రూ.160, వెల్లుల్లి రూ.250 గా ఉన్నాయి.

తవ్వారు.. వదిలేశారు



దత్తసాయికాలనీలో రోడ్డును తవ్వి వదిలేసిన దృశ్యం

మియాపూర్: రోడ్డును తవ్వి వదిలేసిన గుంతలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. మియాపూర్‌లోని దత్తసాయికాలనీలో డ్రైనేజీ పైపులైన్ కోసం రోడ్డును తవ్వి వదిలేయడంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళలో గుంతలు కనిపించక వాహనదారులు కిందపడి ప్రమాదాల భారినపడే అవకాశముంది. సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్ పనులు చేపట్టి రోడ్డు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

15న కొబ్బరికాయల వేలం పాట

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాయంలో కొబ్బరికాయలు విక్రయించేందుకు ఈ నెల 15న వేలం పాట నిర్వహించనున్నట్లు దేవాలయ ఈఓ శశిధర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలం పాటలో భక్తులు, అన్నివర్గాల ప్రజలు పాల్గొనాలన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా తమను సంప్రదించాలని సూచించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం



షేక్ జాకీర్ (ఫైల్)

మియాపూర్: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని హఫీజ్‌పేట్ సాయినగర్ కాలనీకి చెందిన షేక్‌జాకీర్ (42) స్థానికంగా డ్రైవర్‌గా పనిచేస్తూ.. జీవనం కొనసాగిస్తున్నాడు. గత మూడేళ్లుగా అప్పుడప్పుడు మతిమరుపుతో బాధపడుతున్నాడు. మతిమరుపు కారణంగా ఇంట్లో నుంచి వెళ్లిపోయే ప్రయత్నాలు చేసేవాడు. ఈ నెల 5న రాత్రి ఇంటికొచ్చి ఇంట్లో పడుకుని ఉన్నాడు. మరుసటి రోజు ఉదయం లేచిచూసేసరికి కుటుంబసభ్యులకు జాకీర్ ఇంట్లో కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య ఇర్ఫానా బేగం మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

మాదాపూర్: ఇంటి నుంచి బయటికి వెళ్లిన భర్త తిరిగిరాకపోవడంతో భార్య ఫిర్యాదు చేసిన ఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరానికి చెందిన సీర యేసు (28) బతుకుదెరువు కోసం గత 7 ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వచ్చి సిద్ధిక్‌నగర్‌లో కుటుంబసభ్యులతో కలసి నివాసం ఉంటూ.. మెడిసిన్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 2న మధ్యాహ్నం 12 గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లి రెండ్రోజులైన తిరిగిరాలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో భార్య మాలతి మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి



మాజీ కార్పొరేటర్ సాయిబాబాను సత్కరిస్తున్న మహిళా ప్రతినిధులు

రాయదుర్గం: ఖాజాగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ గచ్చిబౌలి డివిజన్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా నాయకత్వంలో నేతలు మర్యాదపూర్వకంగా సమావేశమై భవిష్యత్తు పరిస్థితిపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయినప్పటికీ స్థానికంగా ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఘన విజయం సాధించినా.. ఎలాంటి సమస్యలు ఉండవని పార్టీని మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెడదామని నిర్ణయించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నాయకులు, కార్యకర్తలు అంతా ప్రజలకు చేరువలో ఉంటూ.. వారి సమస్యలను అడిగి తెలుసుకుని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ నాయకులు డివిజన్‌లో మెజార్టీ సాధించడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ.. సాయిబాబాను ఘనంగా సత్కరించారు. బీఆర్ఎస్ నాయకులు చెన్నంరాజు, యాదగిరి, నారాయణతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఈ విజయం మరింత బాధ్యత పెంచింది



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



ఎమ్మెల్యేకుశుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

పటాన్‌చెరు/రామచంద్రాపురం/పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి మూడోసారి హ్యాట్రిక్ విజయాన్ని అందించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతతో పని చేస్తానని, ఈ విజయం తనకు మరింత బాధ్యత పెంచిందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నియోజకవర్గ పరిధిలోని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేశ్, భారతీనగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, మాజీ కార్పొరేటర్లు సపానదేవ్, శంకర్ యాదవ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు విజయభాస్కర్ రెడ్డి వివిధ స్థాయిల ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు,కార్యకర్తలు,భారీ సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు. తన విజయానికి సంపూర్ణ సహకారం అందించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

హరీశ్‌రావును కలిసిన మహిపాల్‌రెడ్డి



హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయానికి సంపూర్ణ సహకారం అందించిన మంత్రి హరీశ్‌రావుకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని, అందరికీ అండగా ఉంటామన్నారు.

గీతంలో వినూత్న ప్రాజెక్టుల ప్రదర్శన



ప్రాజెక్టులను వివరిస్తున్న విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, రుద్రారంలోని స్కూల్ ఆఫ్ టెక్నాలజీ బీటెక్ తొలి ఏడాది విద్యార్థులు సోమవారం తమ వినూత్నమైన ప్రాజెక్టులకు ప్రదర్శించారు. సాంకేతిక అన్వేషణ, ఉత్పత్తి ఇంజినీరింగ్ కార్యక్రమంలో భాగంగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో అభివృద్ధి చేసిన ప్రాజెక్టులను విద్యార్థులు చూపించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడం, ప్రయోగాత్మక విధానాన్ని పెంపొందించడం పై ఈ కార్యక్రమం దృష్టి సారించింది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), ప్రోగ్రామింగ్, సిమ్యులేషన్, మెకానిజమ్స్, మ్యాచింగ్ కలయికను ఉపయోగించడం ద్వారా బహుళ- క్రమశిక్షణా ప్రాజెక్టు-ఆధారిత సామర్థ్యాలను ఇది ప్రోత్సహిస్తుంది. ఈ సెమిస్టర్ లో సుమారు 15 గ్రూపుల విద్యార్థులు పాల్గొని, సూక్ష్మంగా రూపొందించిన నమూనాలను ప్రదర్శించారు. త్రిపుర విద్యుత్ నియంత్రణ సంస్థ (టీఈఆర్సీ) చైర్మన్ డి.రాధాకృష్ణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉత్సాహపరిచారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ పీ.శ్రీనివాస్, బీటెక్ తొలి ఏడాది ప్రోగ్రాం ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ త్రినాథరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అద్భుత సృజనాత్మకతను ప్రదర్శించిన విద్యార్థులను వారు అభినందించారు.

'మానూ'లో ముగిసిన రైస్- 2023



అంతర్జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 'రైస్-2023' అంతర్జాతీయ సదస్సు ముగిసింది. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్‌సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, సెంట్రల్ అమెరికాలోని ఎల్‌సాల్వడార్‌లోని యూనివర్సిడాడ్ డాన్ బాస్కో సంయుక్త ఆధ్వర్యంలో రెండ్రోజుల 8వ అంతర్జాతీయ సదస్సు 'కాన్ఫరెన్స్ ఆన్ ఇంటలిజెంట్ కంప్యూటింగ్ ఇన్ ఇంజినీరింగ్ (రైస్-2023) ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. హనోయ్‌లోని హనోయ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండస్ట్రీకి చెందిన డాక్టర్ బుయ్ టియోన్‌సన్ 'యూఏవీల కోసం భద్రత తాకిడి వైపు' అనే అంశంపై ప్రసంగించారు. ప్రోగ్రామ్ చైర్మన్ డాక్టర్ విజయేందర్‌కుమార్ సోలంకి, సీఎస్ అండ్ ఐటీ విభాగం కన్వీనర్, హెడ్ ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ ముగింపు సమావేశంలో మాట్లాడుతూ.. రెండ్రోజుల పాటు దిగ్విజయంగా ఈ సదస్సును నిర్వహించామన్నారు. మొత్తం 106 పేపర్లలో 46 ఆమోదించబడ్డాయని, అధికారిక ప్రక్రియల కోసం 22 ఎంపిక చేయబడ్డాయన్నారు. డాక్టోరల్ సింపోజియంలో ప్రదర్శన కోసం అదనంగా 24 ఎంపిక చేయబడ్డాయన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ గీతాపట్టున్, పలువురు ప్రొఫెసర్లు ప్రసంగించారు.

కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు



జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని చంద్రమౌళీశ్వరస్వామి



గచ్చిబౌలి శివసాయిక్షేత్రంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

రాయదుర్గం: కార్తీక మాస సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివుడికి అభిషేకం, అర్చనలు, ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాల అనంతరం ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం చేసుకునే అవకాశం కల్పించారు.

- గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నపూర్ణాదేవి, షిర్డీసాయిబాబా, గణేషుడు, ఆంజనేయస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాశీవిశ్వేశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకం, అలంకరించారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు 108 సార్లు రుద్రంతో ప్రత్యేక రుద్ర హోమం నిర్వహించారు.
- సాయిఐశ్వర్యకాలనీలోని శివాలయం, గొలిదొడ్డిలోని శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించి స్వామివారిని అలంకరించారు.
- టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి దేవాలయంలో శివలింగానికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. పలు ఆలయాల్లో కార్తీక దీపాలను వెలిగించారు. ఆకాశదీపం వెలిగించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

రిటర్నింగ్ అధికారిపై ఫిర్యాదు చేస్తా

కాంగ్రెస్ నేత శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న కాటా శ్రీనివాస్‌గౌడ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పటాన్‌చెరు నియోజకవర్గ ఓట్ల లెక్కింపులో అనేక అనుమానాలు ఉన్నాయని, దీనిపై ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నికలు జరగలేదన్నారు. ఓట్ల లెక్కింపులో అనేక అను మానాలు ఉన్నాయని ఆరోపించారు. ఈ విషయంపై రిటర్నింగ్ అధికారి వద్దకు వెళ్లి రీకౌంటింగ్ చేయాలని కోరినా పట్టించుకోలేదన్నారు. 12 గ్రౌండ్ నుంచి 18 రౌండ్ల వరకు ఓట్ల లెక్కింపుపై తమకు అనేక అనుమానాలు ఉన్నాయని, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో సైతం పై రౌండ్‌లకు సంబంధించిన ఓట్ల లెక్కలు లేవని తెలిపారు. నియోజకవర్గంలో పోలైన ఓట్లకు, అధికారుల ప్రకటించిన ఫలితాలకు వ్యత్యాసం ఉందన్నారు. కొన్ని బాక్స్‌లు ముందే తెరిచి ఉన్నాయన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఉదయం లెక్కించకుండా మధ్యాహ్నం లెక్కించి తమ పార్టీ ఏజెంట్లను పక్కదోవ పట్టించారని ఆరోపించారు. తమ ఏజెంట్లు పలుమార్లు రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా ఏకప క్ష నిర్ణయాలు తీసుకున్నారని వాపోయారు. రిటర్నింగ్ అధికారిపై ఫిర్యాదుతో పాటు రీకౌంటింగ్ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. గత ఎన్నికల కన్నా ఈ ఎన్నికల్లో మరింత మెజార్టీని ఇచ్చిన నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన పేదలందరికీ అందేవిధంగా కృషి చేస్తానని చెప్పారు.

అండగా ఉంటా.. అభివృద్ధి చేస్తా !

మణికొండ: నియోజకవర్గంలోని ప్రతి కాంగ్రెస్ నాయకునికి, కార్యకర్తకు అండగా ఉండటంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మణికొండ మున్సిపల్ చైర్మెన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓడినందుకు ఎవ్వరు అధైర్యపడొద్దని, ప్రభుత్వం తమదే వచ్చినందున ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుద్దామన్నారు. రాబోయే రోజుల్లో వచ్చే ఎంపీ, సర్పంచ్, మున్సిపల్, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పార్టీ సత్తా చాటడంతో పాటు నాయకులకు పదవులు వచ్చేలా తన వంతు కృషి చేస్తానన్నారు. గత 15 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి రాబోయే ఐదేళ్లలో చేసి చూయిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ, నార్సింగి, బండ్లగూడ, శంషాబాద్ మున్సిపాలిటీల అధ్యక్షులు జితేందర్, అశోక్‌యాదవ్, కృష్ణారెడ్డి, శేఖర్, కౌన్సిలర్‌లు, డివిజన్‌ల అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ నాయకత్వంలోనే అభివృద్ధి

బండ్లగూడ: రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ నాయకత్వంలో మరింత అభివృద్ధి కానుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ నాల్గోసారి భారీ మెజార్టీతో గెలుపొందేందుకు కష్టపడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే విజయానికి అహర్నిశలు పాటుపడి కష్టపడి పనిచేసిన పూలపల్లి రాజేందర్‌రెడ్డిని సోమవారం కార్పొరేషన్ నాయకులు, కార్యకర్తలు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూలపల్లి రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ గెలుపును ప్రజలంతా తమ సొంత గెలుపుగా భావిస్తున్నారన్నారు. ఆయన గెలుపును పురస్కరించుకొని ప్రజలంతా స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి బాణాసంచా కాల్చి మిఠాయిలు తినిపించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి, సీనియర్ నాయకులు మద్దెల ప్రేమ్‌కుమార్‌గౌడ్, యాదిరెడ్డి, రాజిరెడ్డి, దశరథ్, చంద్రప్రకాష్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శివ, నరేష్, సురేష్, సుజిత్, కుమారి, లలిత, రాజ్యశ్రీ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.